కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్, పీఏసీఎస్ అధ్యక్షుడు శివకుమార్

కొడంగల్, నవంబర్ 11 : రైతులకు ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మద్దతు ధరతో వరి ధాన్యం కొనుగోలు చేస్తుందని, రైతులు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా లాభం పొందాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్, జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని పర్సాపూర్ గ్రామంలో పీఏసీఎస్ హస్నాబాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకోవడానికి ఇబ్బందులు పడకుండా రైతులకు చేరువలోనే ప్రభుత్వ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి అండగా నిలుస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు శివకుమార్ ఉన్నారు.

వృద్ధాశ్రమంలో ఉన్న బాలికలు ప్రత్యేక హోమ్‌కు..

వికారాబాద్, నవంబర్ 11 : వికారాబాద్ సమీపంలోని కొంపల్లిలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమాన్ని వికారాబాద్ జిల్లా న్యాయసేవ సాధికార సంస్థ సెక్రటరీ, న్యాయమూర్తి డీబీ శీతల్ గత నెల 28న సందర్శించారు. అక్కడున్న ఇబ్బందులు, ఆ ఆశ్రమంలో మతిస్థిమితం లేనివారు, వృద్ధులు, అనాథలుగా ఉన్న బాలికలను చూసిన సెక్రటరీ.. అందరినీ వేర్వేరుగా ఉంచాలని నిర్వాహకులకు ఆదేశించారు. ఇద్దరు బాలికలను ప్రత్యేక హోమ్‌కు పంపాలని సంబంధిత అధికారులకు సూచించారు. స్పందించిన డీసీడబ్ల్యూ, ఎస్సీ జిల్లా వెల్ఫేర్ ఆఫీసర్, చైల్డ్‌లైన్ వెల్ఫేర్ కమిటీ అధికారులు బాలికలను పరిగిలోని బాలసదన్‌లో చేర్పించారని శీతల్ తెలిపారు.

ఫిర్యాదుల పరిష్కారానికి చొరవ చూపాలి

ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరించిన రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి, ఉన్నతాధికారులు

ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి తదితరులు

ఆదిబట్ల, నవంబర్ 11 : ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించేలా ఆయా శాఖల అధికారులు వెంటనే చొరవ చూపాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. సోమవారం రంగారెడ్డి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి కలెక్టర్ జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీతతో కలిసి వినతులను స్వీకరించారు. ప్రజావాణిలో వివిధ అంశాలపై 67 దరఖాస్తులు వచ్చాయని.. అందులో రెవెన్యూశాఖ 56, ఇతర శాఖలకు సంబంధించి 11 దరఖాస్తులున్నాయని తెలిపారు.

మృతి చెందిన విద్యార్థి కుటుంబానికి చెక్కు అందజేత

వారం రోజుల క్రితం హయత్‌నగర్ ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్న అజయ్ అనే విద్యార్థి ప్రమాదవశాత్తు పాఠశాల గేట్ పడి మరణించాడు. దీంతో విద్యార్థి కుటుంబానికి రూ.5లక్షల పరిహారంరము చెక్కును కలెక్టర్ అందజేశారు. విద్యార్థి మృతిచెందడం ఎంతో బాధాకరమైన విషయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, తహసీల్దార్లు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించాలి

జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సుధీర్



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్

వికారాబాద్, నవంబర్ 11 : ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సుధీర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు 125 మంది దరఖాస్తు చేసుకున్నారని అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజావాణిలో అందిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని తెలిపారు. డీఆర్‌డీఏ శాఖ, ఇతర శాఖలకు సంబంధించి అర్జీలు వచ్చాయన్నారు. వాటిని సంబంధిత అధికారులకు పంపి సమస్య పరిష్కారమయ్యేలా చూస్తామని ఫిర్యాదుదారులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ శ్రీనివాస్, ఆర్డీవో వాసుచంద్ర, డీపీవో జయసుధ, ఏవో ఫరీనా ఖాతుమ్, డిప్యూటీ తహసీల్దార్ దీపక్ జాన్సన్ పాల్గొన్నారు.

సదర్ సమ్మేళనంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్, పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ తదితరులు

యాదవులు రాజకీయంగా బలోపేతం కావాలి

- మాజీమంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్
- అబ్దుల్లాపూర్‌మెట్‌లో ఘనంగా సదర్ సమ్మేళనం
- స్వాగతం పలికిన యాదవ సంఘం నాయకులు

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబర్ 11 : యాదవులు రాజకీయంగా బలోపేతం కావాల్సిన అవసరం ఉందని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్‌లో అఖిల భారత యాదవ మహాసభ మండల అధ్యక్షుడు బొడుసు శంకర్‌యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి నిర్వహించిన సదర్ సమ్మేళనానికి శ్రీనివాస్‌యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఐక్యతతోనే యాదవులు అభివృద్ధి సాధిస్తారన్నారు. నిజాయితీకి మారుపేరుగా యాదవులకు గుర్తింపు ఉందన్నారు. అన్ని వర్గాల ప్రజలతో మమేకమయ్యే జాతి యాదవుల జాతి అని పేర్కొన్నారు. ప్రపంచ ఖ్యాతి గాంచిన తిరుమల తిరుపతి దేవస్థానం ఆలయ తొలి దర్శనం చేసుకునేది యాదవులేనని గుర్తు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, కాంటెస్టెడ్ ఎమ్మెల్యే శ్రీరాములుయాదవ్, కాంటెస్టెడ్ ఎంపీ మల్లేశ్, గొర్లకాపర మాజీ చైర్మన్ బాల్‌రాజ్‌యాదవ్, యాదవ మహాసభ జాతీయ ప్రధాన కార్యదర్శి రమేశ్‌యాదవ్, కార్యదర్శి హరిబాబుయాదవ్, బాటసింగారం రైతు సేవా సహకార సంఘం చైర్మన్ భరత్‌కుమార్, రంగారెడ్డి జిల్లా యువజన అధ్యక్షుడు లక్ష్మీపతియాదవ్, ప్రధాన కార్యదర్శి సాయియాదవ్, బోడుప్పల్ మాజీ కార్పొరేటర్ మహేందర్ యాదవ్, కుత్బుల్లాపూర్ మాజీ సర్పంచ్ వీరస్వామియాదవ్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వేకు అధికారులు డుమ్మా

- అనామకులతో సర్వే
- మల్కాపూర్ గని కార్మిక సంఘం డైరెక్టర్ రాందాస్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మల్కాపూర్ గని కార్మిక సంఘం డైరెక్టర్ రాందాస్

తాండూరు రూరల్, నవంబర్ 11 : ఇంటింటి సర్వే చేయాల్సిన అధికారులు డుమ్మా కొట్టారని, అనామకులతో సర్వే చేయిస్తున్నారని తాండూరు మండలం, మల్కాపూర్ గని కార్మిక సంఘం డైరెక్టర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జి.రాందాస్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ప్రతిష్టను దిగజార్చేలా అధికారులు వ్యవహరించడం విచారకరమన్నారు. సోమవారం కోటబాసుపల్లిలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల పరిధిలోని కోటబాసుపల్లి గ్రామంలో మూడు రోజులుగా ఉపాధ్యాయులు సర్వే నిర్వహించాల్సి ఉండగా, మిషన్ భగీరథలో పనిచేసే బాబుతోపాటు కె.జగన్, రవి, శ్రీను ఇంటింటికీ తిరుగుతూ సర్వే చేశారని తెలిపారు. సర్వే చేసేటప్పుడు ఎలాంటి తప్పులు లేకుండా చూడాలని కలెక్టర్, ఎంపీడీవోలు గ్రామ స్థాయిలో అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నా, పట్టించుకోకుండా అనామాకులతో సర్వే చేయించడం ఏమిటని ప్రశ్నించారు. సర్వేలో తప్పులు దొర్లితే, ఎవరు బాధ్యులని ప్రశ్నించారు. దీని కారణంగా భవిష్యత్తులో పేదల పేర్లు లేకుండా ఉండే అవకాశం ఉందని, ప్రభుత్వం నుంచి రావాల్సిన పథకాలు పేదలకు అందకుండా పోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. కోటబాసుపల్లిలో సర్వే చేయాల్సిన ఉపాధ్యాయులు ఉన్నారా? లేరా? ఎక్కడా ఉన్నారంటూ ప్రశ్నించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి కూడా అనామకులను సమర్థించడం విచారకరమని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు ఇంటింటి సర్వేపై దృష్టి సారించాలన్నారు. తప్పు చేసిన అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. చర్యలు తీసుకోకుంటే గ్రామస్తులతో కలసి కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు వెంటనే హైవే నిర్మించాలి

- 15 రోజుల్లో పనులు ప్రారంభించకుంటే ఉమ్మడి రంగారెడ్డి జిల్లావ్యాప్తంగా ధర్నాలు చేస్తాం
- బీసీ కార్పొరేషన్ మాజీ సభ్యుడు, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు శుభప్రద్‌పటేల్

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న శుభప్రద్‌పటేల్

పూడూరు, నవంబర్ 11 : హైదరాబాద్, బీజాపూర్ హైవే రోడ్డుపై అనేక రోడ్డు ప్రమాదాలు జరిగాయని, ఎంతో మంది మృతిచెందగా వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయని బీసీ కార్పొరేషన్ మాజీ సభ్యుడు, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు శుభప్రద్‌పటేల్ పేర్కొన్నారు. సోమవారం పూడూరు మండలం మన్నెగూడ గేస్ట్ హౌజ్‌లో మన్నెగూడ టీజీపీఏ(అప్పా) జాతీయ రహదారి (ఎన్‌హెచ్-163) సాధన సమితి ఆధ్వర్యంలో అప్పా నుంచి మన్నెగూడ వరకు త్వరలో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించాలని విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్‌అండ్‌బీ అధీనంలో ఉన్న రోడ్డును 2018లో అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ చౌరస్తా వరకు జాతీయ రహదారి (ఎన్‌హెచ్-163) 6 లైన్ల రోడ్డు నిర్మాణానికై అప్పట్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వాధీనం చేసుకొని రూ.956 కోట్ల నిధులు మంజూరు చేశాయని తెలిపారు. అప్పట్లో రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లను నరకవద్దని కొందరు స్వచ్ఛంద సంస్థల సభ్యులు కోర్టును ఆశ్రయించారని పేర్కొన్నారు. ప్రభుత్వం రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లను మరో చోట పెంచుతామని గత సంవత్సరం క్రితం కోర్టుకు తెలిపిందన్నారు. అప్పా నుంచి మన్నెగూడ చౌరస్తా వరకు రోడ్డు నిర్మాణం చేయాలని కోర్టు క్లియరెన్స్ ఇచ్చినా కాంగ్రెస్ ప్రభుత్వం ఏ మాత్రం చర్యలు తీసుకోవడం లేదన్నారు. గతంలో మెగా కృష్ణారెడ్డి టెండర్ ద్వారా పనులు తీసుకొని ప్రస్తుతం నిర్మాణాలు చేయడం లేదని ఆరోపించారు. అప్పా నుంచి మన్నెగూడ వరకు రహదారి రక్తసిక్తంగా మారినా హైవే రోడ్డు నిర్మాణంపై సీఎం రేవంత్‌రెడ్డి దృష్టి పెట్టడం లేదని విమర్శించారు. వికారాబాద్ జిల్లాకు ముఖ్యమంత్రి, స్పీకర్ ఉన్నా రోడ్డు నిర్మాణాలు జరగడం లేదన్నారు.

పూడూరు మాజీ ఎంపీపీ మల్లేశం, వికారాబాద్ జిల్లా అభివృద్ధి ఫోరం కన్వీనర్ శ్రీనివాస్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు దేవదాస్ మాట్లాడుతూ.. హైదరాబాద్‌కు ఈ ప్రాంతం నుంచి వెళ్లాలంటే గుంతలమయమైన రోడ్డుతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రోడ్డు నిర్మాణాలకు నిధులు మంజూరు చేసినా ప్రస్తుత సర్కారు నిర్మాణాలపై దృష్టి పెట్టడం లేదని విమర్శించారు. రాజకీయలకు అతీతంగా అందరు కలిసి రావాలని కోరారు. త్వరలో అప్పా నుంచి మన్నెగూడ, వికారాబాద్‌కు వెంటనే రోడ్డు నిర్మించాలని.. లేకపోతే రాస్తారోకో, ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వినోద్‌గౌడ్, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి రాజేందర్ ఉన్నారు.

అల్మాస్‌గూడలోని పోచమ్మ కుంట సుందరీకరణ పనులను పరిశీలిస్తున్న మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

ఒక విజన్‌తో చెరువుల అభివృద్ధి

- గత ప్రభుత్వంలో చెరువుల అభివృద్ధికి రూ.40 కోట్లు కేటాయింపు
- కాంగ్రెస్ ప్రభుత్వంలో మురికి కూపాలుగా చెరువులు
- అల్మాస్‌గూడ పోచమ్మ కుంటను పరిశీలించిన ఎమ్మెల్యే సబితారెడ్డి

బడంగ్‌పేట, నవంబర్ 11 : మాజీ ముఖ్య మంత్రి కేసీఆర్ తెలంగాణ రాష్ట్రంలో ఉన్న చెరువులను ఒక విజన్‌తో అభివృద్ధి చేశారని మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలోని అల్మాస్‌గూడ పోచమ్మకుంట సుందరీకరణ పనులను అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి సోమవారం ఆమె పరిశీలించారు. చెరువు చుట్టూ తిరిగి సుందరీకరణ పనులు పూర్తి చేయడానికి ఎంత సమయం పడుతుందని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ ద్వారా చెరువుల్లో ఉన్న పూడిక తీయించామన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత చెరువులు మురికి కూపాలుగా మారుతున్నాయన్నారు. చెరువుల్లో ఉన్న గుర్రపు డెక్కను తొలగించే పరిస్థితి లేదని ఆమె మండిపడ్డారు. బాలాపూర్ మండలంలోనే 42 గొలుసుకట్టు చెరువులు ఉన్నాయని గుర్తు చేశారు. అన్ని చెరువుల్లోకి మురుగు నీరు వస్తున్నదని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. చుట్టుపక్కల కాలనీలవాసులకు దుర్గంధం వస్తుందని.. కాలనీవాసుల నుంచి ఫిర్యాదులు చేస్తున్నారన్నారు. చెరువుల్లోకి మురుగు నీరు పోకుండా ఎస్ఎన్‌డీపీ నాలాల ద్వారా బయటకు పంపించామన్నారు. పోచమ్మ కుంటకు గత ప్రభుత్వంలోనే రూ.2కోట్లు మంజూరు చేసి సుందరీకరణ పనులు చేపట్టడం జరిగిందన్నారు. త్వరగా పనులు పూర్తి చేయకుండా మధ్యలోనే నిలిపివేశారన్నారు. సుందరీకరణ పనులు త్వరగా పూర్తి చేయాలని ఆమె అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. చెరువుల్లో గుర్రపు డెక్కను తొలగించి సుందరీకరణ పనులు పూర్తి చేయాలన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలో 11 చెరువుల్లో సుందరీకరణ పనులు చేపట్టామన్నారు. గతంలో రూ.40కోట్లతో సుందరీకరణ పనులు చేపట్టినట్లు గుర్తు చేశారు. కొన్ని చెరువులను సుందరీకరణ పనులు పూర్తి చేయగా కొన్ని చెరువుల మధ్యలో ఉన్నాయన్నారు. చెరువుల అభివృద్ధి రాజకీయ కోణంలో కాకుండా ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని చూడాలని ఆమె పేర్కొన్నారు. కార్పొరేటర్ సంరెడ్డి స్వప్న వెంకట్‌రెడ్డి, ఏనుగు రాంరెడ్డి, డీఈ యాదయ్య, ఏఈ వినీల్‌గౌడ్, టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రాంరెడ్డి పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు విద్యార్థి రాజేందర్ ఎంపిక

రాజేందర్‌ను సన్మానిస్తున్న ఏంఈవో సత్యనారాయణ, ఉపాధ్యాయులు

కడ్తాల్, నవంబర్ 11 : విద్యార్థుల సంపూర్ణ వికాసానికి చదువుతోపాటు క్రీడలు దోహదపడతాయని మండల విద్యాధికారి సత్యనారాయణ అన్నారు. మైసిగండి గ్రామంలో గల ఆశ్రమ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న రమావత్ రాజేందర్‌నాయక్ జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యాడని జోనల్ సెక్రటరీ భీముడునాయక్ తెలిపారు. భువనగిరిలో ఈ నెల 7 నుంచి 9 వరకు నిర్వహించిన 68వ ఎస్‌జీఎఫ్ ఫెడరేషన్ అండర్-14 విభాగం రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా తరపున రాజేందర్ పాల్గొని అత్యుత్తమ ప్రదర్శన కనబరచడంతో.. రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించే అవకాశం లభించిందని పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాజేందర్‌ను ఏంఈవో తోపాటు ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థుల మానసికోల్లాసానికి క్రీడలు దోహదపడతాయని తెలిపారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచే విద్యార్థులకు భవిష్యత్‌లో ఉద్యోగావకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం జంగయ్య, ఆశ్రమ పాఠశాల హెచ్ఎం బాలరాజు, పీడీ అండ్ పీఈటీల కమిటీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ సాబేర్, పీడీ మంజుల పాల్గొన్నారు.

అధిక సాంద్రత పత్తి సాగుకు తేలికపాటి నేలలు అనుకూలం

శిక్షణా కార్యక్రమంలో రైతులకు దిశానిర్దేశం చేస్తున్న డా.సుధారాణి

పెద్దేముల్, నవంబర్ 11 : అధిక సాంద్రత పత్తి సాగుకు తేలికపాటి నేలలు చాలా అనుకూలంగా ఉంటాయని ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సుధారాణి అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఇందూరు రైతు వేదికలో ఆయా గ్రామాల రైతులకు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ పరిశోధనా స్థానం, ఏరువాక కేంద్రం-తాండూరువారి ఆధ్వర్యంలో సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాటన్ రీసెర్చ్‌వారి ప్రత్యేక ప్రాజెక్టులో భాగంగా అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగుపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడుతూ.. అధిక సాంద్రత పత్తి ఆవశ్యకతను రైతులకు వివరించడం ఎంతో అవసరమన్నారు. కొన్ని సంవత్సరాలుగా పత్తి దిగుబడి నిలకడగా ఉందని, దీనిని పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని రైతులకు సూచించారు. సాధారణ పత్తి సాగులో కూలీల కొరత తీవ్రంగా ఉందని.. వివిధ దశల్లో పత్తి తీయడం రైతులకు భారంగా మారిందని వివరించారు. కావున అధిక సాంద్రతలో యాంత్రీకరణతో పత్తి విత్తుకోవచ్చని, దీనివల్ల విత్తనాలు సరైన లోతులో విత్తడంవల్ల మొలక మంచిగా వస్తుందన్నారు. వరుసలు, మొక్కల మధ్యన 90*15 సెంటీమీటర్ల దూరంతో విత్తుకోవచ్చని వివరించారు. అధిక సాంద్రత పత్తిలో చేపట్టాల్సిన కలుపు యాజమాన్యం, పెరుగుదల నియంత్రణ మందులు, ఎరువుల మోతాదు గురించి, నీటి యాజమాన్యం గురించి రైతులకు వివరించారు.

తాండూరు వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త డాక్టర్ రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. అధిక సాంద్రత పత్తిలో ఆశించే వేరు కుళ్లు తెగులు, ఎండు తెగులు, తలమాడు తెగులు అలాగే వివిధ రకాల ఆకు మచ్చ తెగుళ్ల లక్షణాలు, వాటి యాజమాన్య చర్యలను రైతులకు క్లుప్తంగా వివరించారు.

ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ లక్ష్మణ్ మాట్లాడుతూ.. అధిక సాంద్రత పత్తికి అనువైన రకాల గురించి, అధిక సాంద్రత పద్ధతిలో పంట కాలం త్వరగా పూర్తయి జనవరి మాసంలో రెండో పంటగా పెసర, మినుములు వేసుకొని రైతులు అదనపు ఆదాయాన్ని పొందవచ్చునని రైతులకు సూచించారు.

ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త యమున పత్తిలో వాడాల్సిన లింగాకర్షణ బుట్టల గురించి వాటిని పొలాల్లో ఏవిధంగా అమర్చుకోవాలో వివరించారు. ఎకరానికి 4 లింగాకర్షక బుట్టలు అమర్చుకోవడం ద్వారా మగ పురుగులు ఆకర్షితమై బుట్టలో పడటం వలన పురుగుల ఉధృతి తెలుసుకొని సరైన యాజమాన్య చర్యలకు సరైన సమయంలో చేపట్టాల్సిన చర్యల గురించి తెలిపారు. కార్యక్రమంలో తాండూరు వ్యవసాయ శాఖ ఏడీఏ రుద్రమూర్తి, మండల వ్యవసాయ అధికారి కొమురయ్య, ఆర్‌ఏసీ మెంబర్ నారాయణ పాల్గొన్నారు.

నిత్య విద్యార్థిగానే విద్యనభ్యసించాలి

వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్, నవంబర్ 11 : చదువుకునే క్రమంలో నిత్య విద్యార్థిగానే విద్యనభ్యసించాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. సోమవారం మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ 135వ జయంతిని పురస్కరించుకొని వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని తెలంగాణ మైనార్టీ గురుకుల కళాశాలలో జాతీయ విద్యా దినోత్సవాన్ని (మైనార్టీ సంక్షేమ దినం) నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం మైనార్టీల సంక్షేమంతోపాటు నాణ్యమైన విద్యను అందించేందుకు పెద్ద పీట వేస్తుందన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో దారిద్ర్యరేఖకు దిగువనున్న కుటుంబాల పిల్లలు విద్యనభ్యసిస్తారని, ఇటువంటి వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించి విద్యనందించాలని తెలిపారు.

విద్యార్థులు వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని, చదువు పట్ల మరింత శ్రద్ధతో ముందుకు సాగాలని సూచించారు. విద్యార్థులు ఉన్నత చదువులను అభ్యసించి ఉన్నతస్థాయి అధికారులుగా రాణించి ప్రజలకు సేవ చేయాలన్నారు. మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ మొట్టమొదటి విద్యాశాఖ మంత్రిగా ఎన్నో సేవలను అందించారని గుర్తు చేశారు. విద్యార్థులు మంచి విద్యతోపాటు సామాజిక దృక్పథం కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంగా కళాశాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినులకు కలెక్టర్ ప్రశంసా పత్రాలను అందించి వారిని అభినందించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుధీర్, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, ఫ్లోర్ లీడర్ సుధాకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ మహబూబ్ ఫాతిమా, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

గ్రీన్ ఇండియా చాలెంజ్‌కు విశేష స్పందన

సుభాశ్ పత్రీజీ శక్తి స్థల్ వద్ద మొక్క నాటుతున్న లక్ష్మీనర్సింహారెడ్డి, పిరమిడ్ ట్రస్ట్ సభ్యులు తదితరులు

కడ్తాల్, నవంబర్ 11 : మాజీ రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోశ్‌కుమార్ చేపట్టిన గ్రీన్ ఇండియా చాలెంజ్‌కు విశేష స్పందన లభిస్తున్నది. సోమవారం మండల పరిధిలోని అన్మాస్‌పల్లి గ్రామ సమీపంలో గల మహేశ్వర మహా పిరమిడ్‌లో ధ్యాన గురువు సుభాశ్ పత్రీజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుభాశ్ పత్రీజీ శక్తి స్థల్ వద్ద పిరమిడ్ ట్రస్ట్ సభ్యులు రవికుమార్, చంద్రశేఖర్, నిర్మల, మాధవి, గ్రీన్ ఇండియా చాలెంజ్ కోఆర్డినేటర్ సతీశ్‌తో కలిసి సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భావి తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించడమే లక్ష్యంగా గ్రీన్ ఇండియా చాలెంజ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పేర్కొన్నారు. ప్రకృతిని కాపాడటాన్ని అందరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. రాబోయే తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడానికి మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టిన సంతోశ్‌కుమార్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రవాస భారతీయులు, గ్రీన్ ఇండియా చాలెంజ్ సభ్యులు, పిరమిడ్ సిబ్బంది పాల్గొన్నారు.

సర్వేలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి

అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ నారాయణరెడ్డి

ఆదిబట్ల, నవంబర్ 11 : సర్వేలో ఎలాంటి తప్పులు జరిగినా చర్యలు తప్పవని రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో కలెక్టర్ నారాయణరెడ్డి అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి సౌమ్యతో కలిసి మున్సిపల్ కమిషనర్లు, మండల ప్రత్యేకాధికారులు, మండల అభివృద్ధి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సర్వేపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ సర్వే నిర్వహించాల్సిన బాధ్యత ఉందన్నారు. ఉద్యోగులందరూ సరైన సమయంలో సమయపాలన పాటిస్తూ సర్వే నిర్వహించాలన్నారు. జిల్లాను 5,376 ఎన్యూమరేషన్ బ్లాకులుగా విభజించడం జరిగిందని, సర్వేకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని బ్లాకుల్లో ఎన్యూమరేటర్లు సర్వే ప్రక్రియ కొనసాగించాలన్నారు. కుటుంబ పెద్ద తమ ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, పట్టాదార్ పాసుపుస్తకాలను అందుబాటులో ఉంచేలా చూడాలని, వారి సహకారంతో తప్పులు లేకుండా ఫారం నింపాలన్నార